సాక్షి అన్నమయ్య జిల్లా

గురువారం । 1 । జూన్ । 2023



ఎర్రచందనం దుంగల స్వాధీనం

ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, బొలేరో వాహనాన్ని సీజ్ చేసినట్లు డీఎస్పీ కేశప్ప తెలిపారు. - 8లో



భార్యను హత్య చేసిన భర్త

రాజంపేట మండల పరిధిలోని సీతారామపురంలో భార్యను భర్త హత్య చేసిన ఘటన జరిగింది. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.240	రూ.320
రెండోరకం	రూ.140	రూ.238



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 888 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	436	473
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 1226.80 కిలోలు

న్యూస్‌రీల్

'పొగాకు వద్దు.. ఆరోగ్యమే ముద్దు'

రాజంపేట : 'పొగాకు వద్దు.. ఆరోగ్యమే ముద్దు' అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా.కొండయ్య పిలుపునిచ్చారు. జాతీయ పొగాకు దినోత్సవ సందర్భంగా రాజంపేటలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డా.ఎస్‌సీ కృషి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని బుధవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యులు లక్ష్మీప్రసన్న, వికాస్, అశోక్, మస్తాన్‌బీ, సౌజన్య, ఎంపీహెచ్‌వో అండ్ సీహెచ్‌వో సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పిల్లి పిచ్చయ్య, టీబీ సూపర్‌వైజరు జయప్రకాశ్, శివరాం, పీపీ యూనిట్ సిబ్బంది సిద్ధిరామయ్య, నీరజ, గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖకు రూ.7.50 లక్షల నష్టం



జంబుగానిపల్లిలో నేలకొరిగిన ట్రాన్స్‌ఫార్మర్

పెద్దతిప్పసముద్రం : భీకర పిడుగు శబ్దాలు, ఉరుములు, మెరుపుల కారణంగా విద్యుత్ శాఖకు రూ.7.50 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని డిస్కం ఏఈ ఉత్తన్న బుధవారం తెలిపారు. నాలుగు రోజులుగా మండలంలో ఎటు చూసినా ఉరుములు, భయంకరమైన పిడుగు శబ్దాలు, మెరుపులు, ఈదురు గాలులు వీచడంతో సిబ్బంది రాత్రంబవళ్ళు గ్రామాలు, పొలాల్లో తిరిగి తాత్కాలిక మరమ్మతులు చేపట్టామన్నారు. 19 విద్యుత్ స్తంభాలు విరిగిపోగా, 25 ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయన్నారు. అదే విధంగా రెండుచోట్ల 33 కేవీ సామర్థ్యం గల పెద్ద లైన్లలో 25 పిన్ ఇన్సిలేటర్లు పూర్తిగా దెబ్బ తిన్నాయన్నారు. తద్వారా పలు చోట్ల విద్యుత్‌కు అంతరాయం కలిగినా వేగవంతంగా మరమ్మతులు చేపట్టి ప్రజలు, రైతులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని ఏఈ ఉత్తన్న తెలిపారు.

రైతన్నకు భరోసా

- ప్రతి ఏడాది పంట సాగుకు ముందే పెట్టుబడి సాయంగా అందజేత
- ప్రకృతి వైపరీత్యాల సందర్భంలోనూ ఆదుకుంటున్న ప్రభుత్వం
- ఐదవ ఏడాది తొలి విడతగా రూ. 7500 అందించేందుకు ఏర్పాట్లు
- మార్చి, ఏప్రిల్, మే నెలల్లో పంట దెబ్బతిన్న రైతులకు రూ. 179.16 కోట్ల పరిహారం
- నేడు రైతుల ఖాతాలకు సొమ్ము జమ చేయనున్న సీఎం వైఎస్ జగన్



సాక్షి రాయచోటి : ఆపత్కాలంలో అన్నదాతలను ప్రభుత్వం ఆదుకుంటూ వస్తోంది. ప్రతి ఏడాది ఖరీఫ్‌లో పంట కాలానికి ముందే పంట పెట్టుబడి సాయంగా ప్రభుత్వం రైతన్నలకు అందించి ఆర్థిక భరోసాను కల్పిస్తోంది. సాగుకు అయ్యే ఖర్చులను ముందే అందించడం ద్వారా రైతు పంటలపై పెట్టుబడి పెట్టేందుకు ఉత్సాహంగా కదలనున్నారు. రైతులకు సంబంధించి అనేక సంక్షేమ పథకాలను అందించడమే కాకుండా సబ్సిడీపై యంత్రపరికరాలు, రైతు భరోసా కేంద్రాల ద్వారా వ్యవసాయాన్నే సర్కార్ రైతుల ముంగిటకు తీసుకు వచ్చింది. ప్రతిసారి సంక్షేమ పథకాలను క్యాలెండర్ ప్రకారం సరైన సమయంలోనే అందిస్తూ వస్తోంది. ప్రతి ఏడాది వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయాన్ని రూ.13,500లు అందించడానికి కార్యాచరణ ప్రణాళికలు రచించింది. వైఎస్సార్ రైతుభరోసా కింద 2023–24కు ఐదవ ఏడాదిలో తొలి విడత మొత్తాలను అందించేందుకు ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రూ. 5500, పీఎం కిసాన్ సమ్మాన్ యోజన కింద పెట్టుబడి సాయం కింద రూ. 2000 కలుపుకుని మొత్తం రూ. 7500 అందిస్తున్నారు. అందుకు సంబంధించి గురువారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్సు ద్వారా రైతు భరోసా పథకం ద్వారా సొమ్మును విడుదల చేయనున్నారు. అంతేకాకుండా ప్రకృతి వైపరీత్యాలతో పంటలు దెబ్బతిన్న రైతులకు కూడా వెంటనే సాయం చేస్తూ ప్రభుత్వం మానవత్వాన్ని చాటుకుంటోంది. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో దెబ్బతిన్న పంటలకు సంబంధించి నష్టపరిహారాన్ని కూడా విడుదల చేస్తుండడం విశేషం.

వెన్నుదన్నుగా..

ఈ ఖరీఫ్ సీజన్‌లో వైఎస్సార్ రైతు భరోసా సాయం అందించడానికి జిల్లా వ్యవసాయ శాఖ యంత్రాంగం అర్హుల వివరాలను పొందుపరిచారు. అర్హత ఉన్న ప్రతి రైతుకు భరోసా వచ్చేలా వ్యవసాయ, రెవెన్యూ అధికారుల సమన్వయంతో జాబితా తయారు చేశారు. జిల్లాలో ఈ ఏడాది తొలి విడతలో 2,02,094 మందిని అర్హులుగా గుర్తించి వారికి రూ. 7500 చొప్పున రూ. 151.96 కోట్ల మొత్తాన్ని అందించనున్నారు. తర్వాత మిగిలిన మొత్తాన్ని మరో విడతలో అందించేలా కసరత్తు చేస్తున్నారు. ప్రభుత్వం కూడా నిధులను వెంటనే జమ చేసేలా ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే నాలుగేళ్లుగా రైతులకు వైఎస్సార్ రైతు భరోసా సొమ్ములను ఖరీఫ్, రబీలలో పంట సాగుకు ముందే ప్రభుత్వం విడుదల చేస్తూ వస్తోంది.

రైతు భరోసాకు సంబంధించి వివరాలు

సంవత్సరం	రైతులు	మొత్తం (రూ. కోట్లలో)
2019–20	1,98,748	202.46
2020–21	2,08,836	210.92
2021–22	2,10,810	215.67
2022–23	2,01,829	268.62
2023–24	2,02,094	151.95

ప్రకృతి గాయానికి పరిహారం

అన్నమయ్య జిల్లాలో వడగండ్ల వాన, పెనుగాలుల బీభత్సంతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటోంది. 2023 మార్చి, ఏప్రిల్ నెలల్లో పండ్లతోటలతోపాటు వ్యవసాయ పంటలు కూడా దెబ్బతిన్నాయి. సుమారు 1344 మంది రైతులకు సంబంధించి రూ. 179.16 కోట్లు పరిహారం కింద గురువారం ఖాతాలకు జమ చేయనున్నారు. గురువారం రాయచోటిలోని ఓ కల్యాణ మండపంలో రైతులకు జిల్లా కలెక్టర్ పీఎస్ గిరీషా మెగా చెక్కును అందించనున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కర్నూలుజిల్లా పత్తికొండలో ఏర్పాటు చేయనున్న బహిరంగ సభలో రైతులకు రైతు భరోసా నిధులను విడుదల చేయనున్నారు.

అన్నదాతలకు అండగా..



రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా పెట్టుబడి సాయాన్ని అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ, వ్యవసాయశాఖల సహకారంతో అర్హులైన రైతులను గుర్తించాం. గురువారం రాయచోటి జిల్లా ప్రధాన కేంద్రంలో 'వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్' ఐదవ సంవత్సరం మొదటి విడత లబ్ధి పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాం. జిల్లాలో 2,02,094 మంది రైతులకు రూ.151.96 కోట్ల మేర ముఖ్యమంత్రి చేతుల మీదుగా వర్చువల్ విధానంలో వైఎస్సార్ రైతు భరోసా పీఎం కిసాన్ లబ్ధి విడుదల చేయనున్నారు. అలాగే అకాల వర్షాల వలన పంట నష్టపోయిన రైతులకు రూ. 179.16 కోట్ల మేర పంట నష్టపరిహారం కూడా విడుదల చేయనున్నారు.

– పీఎస్ గిరీషా, జిల్లా కలెక్టర్, అన్నమయ్య జిల్లా

'మెడికల్ అండ్ హెల్త్'లో సాధారణ బదిలీలకు సన్నాహాలు

- 30 శాతం చొప్పున బదిలీలు
- ఐదేళ్లు సర్వీసు దాటిన వారికి బదిలీ తప్పనిసరి
- జోన్–4 పరిధిలో ఉద్యోగుల వివరాలపై ఆరా
- ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు కౌన్సెలింగ్‌కు చర్యలు



వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం

కడప రూరల్ : కడపలోని వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం (జోన్–4) పరిధిలో ఉద్యోగుల సాధారణ బదిలీలకు సంబంధించిన ప్రక్రియ వేగవంతమైంది. ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆ శాఖ పరిధిలో బదిలీల కోలాహలం నెలకొంది.

మొత్తం 4 వేల మందికి పైగా ఉద్యోగులు...

ఈ శాఖ పరిధిలో ఇప్పటికే పరస్పర బదిలీలు (మ్యూచువల్) ముగిశాయి. తాజాగా సాధారణ బదిలీల ప్రక్రియ ప్రారంభమైంది.ఈ శాఖ పరిధిలో రాయలసీమ వ్యాప్తంగా దాదాపు 30 కేడర్‌లకు సంబంధించి 4 వేల మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అందులో మొత్తం ఉద్యోగుల్లో 30 శాతం చొప్పున ఐదేళ్ల సర్వీసు నిండిన ఉద్యోగులు తప్పనిసరిగా బదిలీ కావాల్సివుంటుంది. 30 శాతం చొప్పున అంటే దాదాపు 1200 మంది ఉద్యోగులు పరిగణలోకి వస్తారు. అయితే ఇప్పటికే పరస్పర బదిలీలు జరిగిన కారణంగా తాజాగా చేపట్టే సాధారణ బదిలీల్లో 600 మంది ఉద్యోగులు ఉంటారని అంచనా. కాగా రెండేళ్ల సర్వీసు నిండిన వారు కూడా బదిలీలకు దరఖాస్తు చేసుకోవచ్చు. వారికి అవకాశం ఉంటే 30 శాతం చొప్పున చేపట్టే బదిలీల్లో పోస్టింగ్‌కు ఆస్కారం ఉంటే బదిలీ కావచ్చు. అలాగే దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులు, భార్య భర్తలుగా ఉన్న ఉద్యోగులకు బదిలీల్లో మొదటి ప్రాధాన్యత ఇస్తారు. ఇందుకు సంబంధించి ఆ శాఖ అధికారులు ఉద్యోగుల సర్వీసు వివరాలను సేకరిస్తున్నారు. అందులో నుంచి సీనియారిటీ ప్రకారం 30 శాతం పరిధిలోకి వచ్చే ఉద్యోగల జాబితాను సిద్ధం చేస్తారు.

అడ్డదారుల కోసం ఆరా....

కొంత మంది ఉద్యోగులు దీర్ఘకాలికంగా 'ఫెవికాల్' వీరుల్లా ఏళ్ల తరబడి ఒకే సీటులో విధులను చేపడుతున్నారు. అందులో కొంతమంది జరగబోవు సాధారణ బదిలీల నుంచి తప్పించుకోవడానికి పరస్పర బదిలీలను సద్వినియోగం చేసుకున్నారు. ఇంకా చాలా మంది ఉద్యోగులు ఉన్నచోటే విధులను చేపట్టడానికి విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. అడ్డదారుల కోసం వెతుకుతున్నారు. కాగా సాధారణ బదిలీల్లో ఏపీ ఎన్జీఓ అసోసియేషన్, ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి మాత్రమే వర్తింపు ఉంది. ఈ సంఘాల్లో పనిచేసే సభ్యులకు మాత్రమే బదిలీల నుంచి కొంత మినహాయింపు ఉంది. అంటే ఈ సంఘాల్లోని సభ్యులకు సాధారణ బదిలీల నుంచి మూడు దఫాలు లేదా 9 ఏళ్ల సర్వీసు వరకు మినహాయింపు ఉంటుంది. అంటే తొమ్మిదేళ్ల సర్వీసు పూర్తయిన వారు తప్పని సరిగా బదిలీ కావాల్సివుంటుంది. కాగా కొంతమంది ఏ అసోసియేషన్‌లో పనిచేయనప్పటికీ బదిలీల నుంచి తప్పించుకోవడానికి అప్పటికప్పుడు ఏదో ఒక అసోసియేషన్ నుంచి సంఘంలో సభ్యత్వం ఉన్నట్లుగా లేఖలను సిద్ధం చేసుకుంటున్నట్లుగా ఆ శాఖ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఇలా కొంతమంది ఉద్యోగులు తమ స్థానాలను వదలకుండా ఉండడానికి పలు విధాలుగా అడ్డదారులను వెదుకుతున్నట్లుగా సమాచారం.

పారదర్శకంగా బదిలీలు..



ప్రభుత్వ నిబంధనల ప్రకారం పారదర్శకంగా సాధారణ బదిలీలు చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఇందులో ఎలాంటి మినహాయింపులు ఉండవు. నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలి. ఏమైనా సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకురావాలి.

– డాక్టర్ అనిల్‌కుమార్, రీజనల్ డైరెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం

సరస్వతీ నిలయంగా మదనపల్లె

- అన్నమయ్య జిల్లాకు తలమానికంగా బీటీ యూనివర్సిటీ
- ఉపాధికి ఉపయోగపడేలా కోర్సుల రూపకల్పన
- త్వరలో కేంద్రీయ విద్యాలయ స్కూల్ ప్రారంభం
- డీపీఆర్ తయారీకి కళాశాలను సందర్శించిన హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్, ఎంపీ, ఎమ్మెల్యే



అనిబిసెంట్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా, హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ హేమచంద్రారెడ్డి తదితరులు

మదనపల్లె : ఘనకీర్తి కలిగిన చారిత్రాత్మక మదనపల్లె పట్టణాన్ని సరస్వతీ నిలయంగా తీర్చిదిద్దుతామని వైఎస్సార్ సీపీ లోక్‌సభపక్షనేత, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను యూనివర్సిటీగా మార్పుచేసేందుకు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సుముఖత వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ హేమచంద్రారెడ్డి బుధవారం పరిశీలనకు రావడంతో ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా బీటీ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా బీటీ కళాశాల పూర్వవిద్యార్థుల సంఘం, ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు వారికి ఘనస్వాగతం పలికారు. తర్వాత కళాశాలలోని సమావేశ మందిరంలో అనిబిసెంట్ విగ్రహానికి ముఖ్య అతిథులు పూలమాల వేసి నివాళులర్పించారు.

- అనంతరం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ.. బీటీ కళాశాలను యూనివర్సిటీ చేసే క్రమంలో భాగంగా హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ హేమచంద్రారెడ్డి కళాశాలను పరిశీలించి మౌలిక వసతులు, కోర్సులు తదితరాలపై డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్(డీపీఆర్) తయారు చేసి ప్రభుత్వానికి అందిస్తారని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్ పెద్ద మనసుతో ఇప్పటికే మదనపల్లెకు మెడికల్ కళాశాల మంజూరు చేశారని, బీటీ కళాశాలను యూనివర్సిటీగా చేసేందుకు నిర్ణయం తీసుకోవడంపై కృతజ్ఞతలు తెలిపారు. బీసీటీ ట్రస్టు ప్రభుత్వానికి అందించిన స్థలంతో పాటుగా యూనివర్సిటీకి అదనంగా 40–50 ఎకరాల స్థలం అవసరమని చెప్పడంతో పట్టణ పరిసర ప్రాంతంలో మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు. తిరుపతి అభివృద్ధిలో దేవాలయంతో పాటుగా యూనివర్సిటీ ముఖ్యపాత్ర పోషించినట్లుగానే మదనపల్లె పట్టణ అభివృద్ధికి బీటీ యూనివర్సిటీ దోహదపడుతుందన్నారు. ఉపాధికి ఉపయోగపడేలా కోర్సులను ప్రవేశపెడతామన్నారు. అలాగే సెంట్రల్ క్యాబినెట్ అప్రూవ్ లిస్ట్‌లో మదనపల్లె కేంద్రీయ విద్యాలయం పేరును చేర్చామని త్వరలోనే ప్రారంభానికి కృషిచేస్తామన్నారు.
- హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ.. స్వాతంత్రోద్యమంలో ప్రముఖపాత్ర పోషించిన కళాశాలకు రావడం సంతోషంగా ఉందన్నారు. స్థానిక ప్రజలకు బీటీ కళాశాలతో ఉన్న అనుబంధాన్ని కలకాలం కొనసాగించేందుకు ఎంపీ మిథున్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని బీసీటీ ట్రస్టుసభ్యులతో మాట్లాడి ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చేందుకు కృషిచేశారన్నారు. బీటీ కళాశాలను యూనివర్సిటీగా చేయాలని ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం ఇవ్వడం, ఆయన సుముఖత వ్యక్తం చేయడంతో డీపీఆర్ తయారీకి వచ్చినట్లు చెప్పారు. పట్టణంలో ముస్లిం జనాభా అధికంగా ఉన్న నేపథ్యంలో ఉర్దూ, అరబిక్ స్టడీస్‌తో పాటుగా ప్రస్తుత పరిస్థితులకు, ఉపాధికి అనుకూలంగా ఉండే కోర్సులను ప్రవేశపెట్టి జనరల్ యూనివర్సిటీగా ఏర్పాటుచేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.
- ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ.. పట్టణ ప్రజల చిరకాల కోరికను మన్నించి, అడిగిన వెంటనే మదనపల్లెకు మెడికల్ కళాశాల, బీటీ యూనివర్సిటీ మంజూరుచేసి పట్టణాన్ని ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నందుకు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.
- కార్యక్రమంలో ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్‌లు జింకాచలపతి, నూర్‌ఆజం, జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు బాబ్‌జాన్, పూర్వ విద్యార్థి సంఘ నాయకులు మార్వూరి శశిధర్, మాజీ కౌన్సిలర్ మధుసూదన రెడ్డి, శ్రీనివాసులు నాయుడు, బోర్‌వెల్ సుధ, సుధాకర్ నాయుడు, ఆకుల కిరణ్ కుమార్, జల్లా లలితమ్మ, పీటీఎం.శివప్రసాద్, యమలా సుదర్శనం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తట్టి శ్రీనివాసులు రెడ్డి, వైఎస్.మునిరత్నం, ప్రిన్సిపాల్ సుధాకర రెడ్డి, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యకరం

ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

రాయచోటి : ప్రకృతి వ్యవసాయంతో నేలకు, వాతావరణానికి, మానవాళి మనుగడకు అన్ని రకాలుగా ఆరోగ్యకరమని వైఎస్సార్ సీపీ రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. బుధవారం రాయచోటి మార్కెట్ యార్డులో ఏపీసీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సుకు ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డీపీఎం యశోదమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడి తక్కువ, దిగుబడి ఎక్కువ, ఆరోగ్యకరమైన ప్రయోజనాలు మెండుగా ఉన్నాయన్నారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టిసారించేలా అధికారులు, సిబ్బంది ప్రణాళికలు రూపొందించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. రైతులను చైతన్య పరుస్తూ ప్రకృతి వ్యవసాయంవైపు మొగ్గు చూపేలా మరింత కృషి చేయాలన్నారు. సబ్సిడీ వేరుశనగ విత్తన పంపిణీ పక్కాగా చేపట్టాలన్నారు.

జిల్లాలో ఏటా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల సంఖ్య పెరుగుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నాయన్నారు. రాయచోటి నియోజకవర్గంలో ప్రతి మండలంలోనూ రెండువేల ఎకరాలలో ప్రకృతి వ్యవసాయం సాగయ్యేలా లక్ష్యాలను పెట్టుకోవాలని అధికారులు, సిబ్బందికి సూచించారు.

డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, రామాపురం జడ్పీటీసీ ఎం. వెంకటరమణ, గాలివీడు వైస్ ఎంపీపీ మిట్టపల్లి యదుభూషన్ రెడ్డి, మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డి, సర్పంచ్ చిదంబర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా సంఘం సభ్యుడు దిన్నెపాడు రవిరాజు ప్రకృతి వ్యవసాయం సాగుతో కలిగే ప్రయోజనాలు గురించి వివరించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ తబ్రేజ్ ఖాన్, రాయచోటి జడ్పీటీసీ వెంకటేశ్వరరెడ్డి, లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి, మండల టీసీ నాయకుడు పల్లపు రమేష్, రామాపురం వైస్ ఎంపీపీ రవిశంకర్ రెడ్డి (బాబు), రాళ్లపల్లె రవీంద్ర నాయుడు, జిల్లా విజిలెన్సు మానిటరింగ్ కమిటీ సభ్యుడు చుక్కా అంజనప్ప, అమరనాథరెడ్డి, ఇర్షాద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఒంటిమిట్టలో స్టేట్ ఇన్ఫర్మేషన్ కమిషనర్


ఆలయంలోని బలి పీఠానికి నమస్కరిస్తున్న ఏపీ స్టేట్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ జనార్ధన్‌రావు

ఒంటిమిట్ట : ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో వెలసిన సీతారామలక్ష్మణ మూర్తులను బుధవారం ఏపీ స్టేట్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ జనార్ధన్‌రావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ లాంఛనాలతో అర్చకులు స్వాగతం పలికారు. ఆయన ఆలయ ప్రదక్షిణ చేసి, గర్భాలయంలో ఉన్న మూలమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ రంగ మండపంలో సేదతీరి, స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

యువతి ఆత్మహత్య

వీరబల్లి (రాయచోటిటౌన్) : వీరబల్లి మండలం ఆసాదివాండ్లపల్లెకు చెందిన నాగవేణి (23 ఆత్మహత్య చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. నాగవేణి రాయచోటి పట్టణంలోని ఓ బట్టల షాపులో గుమస్తాగా పని చేస్తుండేది. రోజు మాదిరిగా బుధవారం రాయచోటికి వెళ్తున్నానని ఇంటి దగ్గర చెప్పి వెళ్లింది. అయితే మార్గం మధ్యలో ఏమి జరిగిందో తెలియదు కానీ క్రిమి సంహారణ మందు తాగి ఆత్మహత్యకు పాల్పండింది. ఈ విషయం ఆమె పని చేసే షాపులో పని చేస్తున్న మరో అబ్బాయికి తెలియడంతో.. ఆమెను కాపాడే ప్రయత్నం చేస్తూ రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి డాక్టర్లు పరిస్థితి సరిగా లేదని కడపకు వెళ్లాలని చెప్పారు. కడపకు వెళ్తుండగా మార్గంమధ్యలో ఆమె మృతి చెందినట్లు మృతురాలి బంధువులు తెలిపారు. ఆమె ఎందుకు ఆత్మహత్య చేసుకొందనే విషయం తెలియాల్సి ఉందని ఆమె బంధువులు పేర్కొన్నారు. జరిగిన సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మరిన్ని వివరాలు తెలియరావాల్సి ఉంది.

పిడుగుపాటుతో ఆవు మృతి

గుర్రంకొండ : పిడుగు పడి పాడి ఆవు మృతి చెందిన సంఘటన మండలంలోని ఎల్లుట్ల గ్రామ కస్పాలో జరిగింది. గ్రామానికి చెందిన సాప్పారపు రామాంజులు పాడిఆవులు మేపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఉదయం పాడిఆవులను గ్రామ సమీపంలోని తమ పొలానికి తోలుకెళ్లాడు. వర్షం కురవడంతోపాటు పిడుగు మీద పడడంతో పాడిఆవు అక్కడికక్కడే మృతి చెందింది.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

సింహాద్రిపురం : సింహాద్రిపురంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ పులివెందుల ఆర్డీఓ వెంకటేశులుతో కలిసి బుధవారం సాయంత్రం తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్ బాషా, డీటీ వెంకటరెడ్డి, ఆర్ఐలు షేక్షావల్లి, రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

11 ఎర్రచందనం దుంగల స్వాధీనం

నేరస్తుడి అరెస్ట్, వాహనం సీజ్

మదనపల్లె : ఎర్రచందనంను అక్రమంగా తరలిస్తున్న నేరస్తుడిని అరెస్ట్ చేసి రూ.10 లక్షల విలువచేసే 11 ఎర్రచందనం దుంగలు, రవాణాకు వినియోగించిన బొలేరో వాహనాన్ని సీజ్ చేసినట్లు డీఎస్పీ కేశప్ప తెలిపారు. బుధవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గాలివీడు మండలం అరివీడు పంచాయతీ శింగంవారిపల్లె గ్రామానికి చెందిన పూలవిజయ్‌కుమార్(22) రాయచోటిలోని సుదర్శన్ వద్ద జేసీబీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇతడికి జూదం, ఇతర చెడుఅలవాట్ల వల్ల.. వచ్చే సంపాదన చాలకపోవడంతో అక్రమ మార్గాలను ఎంచుకున్నాడు. మామ మల్లికార్జునతో ఈ విషయం చెప్పి బాధపడితే.. డ్రైవర్‌గా ఎర్రచందనం తరలిస్తే లోడుకు రూ.2,000 ఇస్తానని చెప్పడంతో అక్రమ రవాణాకు ఒప్పుకున్నాడు. దీంతో మామా, అల్లుళ్లు ఇద్దరూ సుమారు మూడు నెలలుగా ఎర్రచందనం దుంగలను ఎవ్వరికీ అనుమానం రాకుండా కర్ణాటక రాష్ట్రం బెంగళూరు సమీపంలోని కటికనహళ్లికి తరలించి నవీద్‌బాషాకు విక్రయించేవారు. సోమవారం రాత్రి మామ మల్లికార్జున విజయ్‌కుమార్‌కు ఫోన్ చేసి నూలివీడురోడ్డులోని


దుంగలు, నేరస్తుడి అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ కేశప్ప

దొడ్ల డెయిరీ పక్కన కాలువలో ఎర్రచందనం దుంగలు దాచి పెట్టానని, వాటిని తీసుకుని నవీద్‌బాషాకు ఇచ్చేందుకు రావాల్సిందిగా కోరాడు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం 12.30 గంటల ప్రాంతంలో ఎర్రచందనం అక్రమ రవాణాపై అందిన సమాచారం మేరకు బి.కొత్తకోట ఎస్‌ఐ రామమోహన్ గుడిపల్లె పంచాయతీ మొరవపల్లె క్రాస్, బి.కొత్తకోట–బెంగళూరు రోడ్డుపై హెరిటేజ్ డెయిరీ ముందర తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పూలవిజయ్‌కుమార్, ఏపీ–21, టీఎక్స్–4906 వాహనంలో 245.5 కిలోల బరువు కలిగిన 11 ఎర్రచందనం దుంగలను తరలిస్తూ పట్టుబడ్డాడు. బహిరంగ మార్కెట్‌లో ఈ దుంగల విలువ సుమారు రూ.10 లక్షల వరకు ఉంటుంది. దీంతో నేరస్తుడు విజయకుమార్‌ను అరెస్ట్ చేసి, 11 ఎర్రచందనం దుంగలను, రూ.6 లక్షల విలువ చేసే బొలేరో వాహనాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిందితుడిని చాకచక్యంగా పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన రూరల్ సీఐ శివాంజనేయులు, బి.కొత్తకోట ఎస్‌ఐ రామమోహన్, సిబ్బందిని డీఎస్పీ కేశప్ప ప్రత్యేకంగా అభినందించారు.

కేజీబీవీల్లో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష సొసైటీ పాఠశాల విద్యాశాఖ ద్వారా నిర్వహిస్తున్న ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న బోధనా సిబ్బంది పోస్టులకు ఒప్పంద ప్రాతిపదికన ఒక సంవత్సరం కాలానికి భర్తీ చేయుటకు దరఖాస్తులను కోరుతున్నట్లు సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక సమగ్ర శిక్ష ప్రాజెక్టు కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. ప్రిన్సిపాల్స్ పోస్టులకు సంబంధించి 9, పిజిటి జనరల్‌కు 80, సీఆర్టీ 22, పీఈటీ 7 మొత్తంగా 118 పోస్టులు ఖాళీ ఉన్నాయన్నారు. ఈ పోస్టులకు ఆసక్తి గల మహిళా అభ్యర్థులు తమ దరఖాస్తులను apkgbv.apcfcc.in వెబ్‌సైట్ ద్వారా చేసుకోవాలన్నారు. దరఖాస్తులను జూన్ 5వ తేదీ రాత్రి 11.59 వరకు చేసుకోవచ్చన్నారు. ఆఫ్‌లైన్‌లో ఫిజికల్ దరఖాస్తులు స్వీకరించబడవని తెలిపారు. వయో పరిమితి ఓపెన్ కేటగిరి అభ్యర్థులకు 18 నుంచి 42 ఏళ్లు ఉండాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 5, మాజీ సైనిక ఉద్యోగులకు 3, దివ్యాంగులకు 10 ఏళ్లు సడలింపు ఉంటుందని తెలిపారు. జిల్లాల వారిగా సబ్జెక్టు వారిగా రోస్టర్ వారిగా పోస్టుల ఖాళీలు, విద్యార్హతలను వెబ్‌సైట్‌లో ఉంచిన పూర్తి నోటిఫికేషన్ ద్వారా పొందవచ్చని తెలిపారు.

బ్రౌన్‌కు 'కేతు' సేవలు మరువలేనివి


ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైవీయూ వీసీ, సాహితీవేత్తలు

కడప కల్చరల్ : తెలుగు వారికి గర్వకారణంగా నిలిచిన సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రానికి ప్రముఖ కథకులు, బ్రౌన్ గ్రంథాలయం సలహా మండలి సభ్యులు ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి అందించిన సేవలు అనిర్వచనీయమని, ఆయన మరణం ఈ కేంద్రానికి తీరని లోటుగా భావిస్తున్నామని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. బుధవారం బ్రౌన్ కేంద్రంలో ప్రసిద్ధ కథా రచయిత ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. వైవీయూ వీసీ చింతా సుధాకర్, కుల సచివులు ఆచార్య వైపీ వెంకట సుబ్బయ్య, బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, పరిశోధన కేంద్రం సిబ్బంది తదితరులతో కలిసి కేతు విశ్వనాథరెడ్డి చిత్రపటానికి పూలమాల అలంకరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ చింతా సుధాకర్ మాట్లాడుతూ ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి కథకునిగా, విద్యావేత్తగా, పరిశోధకునిగా, నిరంతరం సృజనశీలిగా పేరు గాంచారన్నారు. తన చుట్టూ ఉన్న సమాజాన్ని నిశితంగా పరిశీలించి మానవ సంబంధాలను శాస్త్రీయ దృక్పథంతో విశ్లేషించి రచనలు చేశారన్నారు. ఆయన జిల్లా, గ్రామ నామాలపై పరిశోధన చేసి ఆయా గ్రామాల జీవన విధానం, ఆచార వ్యవహారాలు, ఆర్థిక అసమానతలను తెలిపారని పేర్కొన్నారు. కుల సచివులు ఆచార్య వైపీ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ బ్రౌన్ కేంద్రం సలహా మండలి సభ్యులుగా ఆచార్య కేతు అందించిన సేవలు ఈ కేంద్రం అభివృద్ధికి ఎంతో దోహదపడ్డాయన్నారు. ఇక్కడ జరిగే అన్ని సాహితీ కార్యక్రమాలలో పాల్గొనే వారని తెలిపారు. బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి ఆచార్య కేతు జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో బ్రౌన్ కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథ పాలకులు రమేష్‌రావు, హరిభూషణరావు, జూనియర్ అసిస్టెంట్లు వెంకటరమణ, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

రూ. 1.76 లక్షల టపాసులు స్వాధీనం

రాజంపేట : పట్టణంలోని బంద్రాళ్ల వీధిలో అనుమతి లేకుండా అక్రమంగా నిర్వహిస్తున్న బాణసంచా దుకాణాన్ని సీజ్ చేశామని రాజంపేట డీఎస్పీ చైతన్య వెల్లడించారు. బుధవారం టౌన్‌పోలీసుస్టేషన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పచ్చిపులును లక్ష్మీనారాయణ జననివాసాల మధ్య రూ.1.76 లక్షల విలువ చేసే బాణాసంచాలను నిల్వ ఉంచగా స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇక నుంచి రాజంపేట పట్టణంలో జననివాసాల మధ్య బాణసంచాలను విక్రయించడం, నిల్వ చేసుకోవడం చేయడాన్ని సీరియస్‌గా తీసుకుంటామన్నారు. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్‌ఐలు ప్రసాద్‌రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అక్రమ కేబుల్ సర్వీస్ వ్యక్తిపై కేసు

కలకడ : యాజమాన్యం అనుమతి లేకుండా కొన్ని చానళ్లను అక్రమంగా టెలివిజన్ సర్వీస్ లబ్ధిదారులకు అందిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ సునీల్‌కుమార్ తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాయచోటికి చెందిన శివ(శివకుమార్) కలకడ మండలం కోన గ్రామంలో ఏటివికేబుల్ నెట్‌వర్క్ ఇంటింటికి కేబుల్ సరఫరా చేసి వినోదం పంచుతున్నాడు. అయితే స్టార్‌ఫేచానల్, జీ తెలుగు చానెల్‌లు అనుమతి లేకుండా ఆపరేట్ చేస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు మహమ్మద్‌కులియా, ఖురేషి బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేబుల్ ఆపరేటర్ శివపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

భార్యను హత్య చేసిన భర్త


వరలక్ష్మి మృతదేహం

రాజంపేట : పోలి పంచాయతీ పరిధిలోని సీతారామపురం గ్రామంలో బుధవారం రాజబోయిన వరలక్ష్మి (38)ని భర్త గంగయ్య హత్య చేశారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సీతారామపురానికి చెందిన వరలక్ష్మి, గంగయ్యకు 25 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి ముగ్గురు సంతానం. ఇందులో ఇద్దరు కుమార్తెలకు వివాహాలు చేశారు. కుమారుడు ఉన్నాడు. గంగయ్య పట్టణంలోని చికెన్ దుకాణంలో పని చేస్తూ రెండు రోజులకొకసారి ఇంటికి వచ్చే వాడని, మానసిక పరిస్థితి సరిగ్గా లేదని స్థానికులు అంటున్నారు. భార్య, భర్తల మధ్య తరుచుగా గొడవలు జరుగుతుండేవి. పైగా భార్యపై అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఇంటికి రాగానే భార్యతో గొడవకు దిగాడు. మాటకుమాట పెరిగి చలంగపారతో తల మీద కొట్టాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి సీఐ పుల్లయ్య, ఎస్‌ఐ భక్తవత్సలం చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. గంగయ్యను అదుపులోకి తీసుకున్నారు. మృతురాలి కుమార్తె ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పగలు డ్రైవర్.. రాత్రి దొంగతనాలు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ చైతన్య

రాజంపేట : రాజంపేట పట్టణంలోని తుమ్మల అగ్రహారానికి చెందిన ముద్దపోలు నవీన్‌కుమార్ పగలు రేషన్ పంపిణీ వాహనం డ్రైవరుగా విధులు నిర్వర్తిస్తూ.. రాత్రి వేళలో దొంగతనాలకు పాల్పడుతున్న వైనాన్ని పోలీసులు బుధవారం బట్టబయలు చేశారు. రేషన్ పంపిణీ వాహనం డ్రైవర్‌గా ముందస్తుగా ఎవరెవరు ఇంట్లో ఉన్నారు? ఏ ఇంటికి తాళాలు వేశారు? ఎవరైనా ఊరికి వెళ్లారా? అనే విషయాలపై రెక్కీ నిర్వహిస్తాడు. అంతేగాకుండా వాహనం వద్ద రేషన్‌కు వచ్చే మహిళలతో సంభాషణల ద్వారా ఊర్లో ఉన్నారో, లేదో తెలుసుకోవడం, ఆ ఇంటికి కన్నాలు వేసి దోచుకోవడం చేసే వాడు. ఇతను 12 కేసులలో నిందితుడు. స్థానిక అర్బన్ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ చైతన్య మాట్లాడుతూ వరుస దొంగతనాల కేసులో భాగంగా రెండు కేసులకు సంబంధించి ఎండీయూ డ్రైవర్ నవీన్‌ను అరెస్టు చేశామన్నారు. అతని వద్ద నుంచి రూ.1.33 లక్షల విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. అంతరాష్ట్ర దొంగగా పోలీసులు గుర్తించారు. సమావేశంలో డీఎస్పీతోపాటు పట్టణ ఎస్‌ఐలు ప్రసాద్‌రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కారు, స్కూటర్ ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో రోడ్డుపై పడిన యువకులు

రాజంపేట : కడప–రేణిగుంట జాతీయ రహదారిలోని చొప్పావారిపల్లె క్రాస్(రాజంపేట)లో బుధవారం సాయంత్రం కారు, స్కూటర్ ఢీకొని ఇద్దరు తీవ్ర గాయాల పాలయ్యారు. గుండ్లూరు నుంచి జాఫర్, అస్రఫ్‌లు స్కూటీపై చొప్పావారిపల్లె క్రాస్ వద్ద హైవేలోకి ప్రవేశించారు. ఇదే క్రమంలో కడప నుంచి తిరుపతికి కారు వెళ్తోంది. ఈ రెండు వాహనాలు ఢీకొన్నాయి. గాయపడిన వారు ఎల్లాగడ్డకు చెందిన వారిగా గుర్తించారు. గాయపడిన వీరిని చికిత్స నిమిత్తం రాజంపేట ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోను ఢీకొన్న కారు

పెద్దతిప్పసముద్రం : పీటీఎం–బి.కొత్తకోట రోడ్డులోని పెద్ద లైన్ సమీపంలో బుధవారం ఆటోను ఎదురుగా వచ్చిన ఓ కారు ఢీకుంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కందుకూరు నుంచి బి.కొత్తకోటకు ఎనిమిది మంది ప్రయాణికులతో వెళుతున్న ఆటోను ఎదురుగా వేగంగా వచ్చిన కారు ఢీకొంది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న వారిలో ఐదుగురికి స్వల్ప గాయాలు కాగా, ఆటో డ్రైవర్ రాముడు (55), వెంకటరెడ్డి (46), వెంకట్రమణ (43)కు తీవ్ర గాయాలు అయ్యాయి. ద్విచక్ర వాహనంలో పీటీఎం వైపు వెళుతున్న భాస్కర్ నాయుడు, మెకానిక్ చంద్రలు ప్రమాద దృశ్యాన్ని చూసి 108 వాహనంకు సమాచారం అందించి బాధితులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

బైక్‌ను ఢీకొన్న బొలేరో


సంఘటనా స్థలంలో సుబ్బరాయుడు

సంబేపల్లె : చిత్తూరు– కర్నూలు జాతీయ రహదారిపై బుధవారం బొలేరో వాహనం, బైక్ ఢీకొని ఒకరు మృతి చెందగా, మరొకరు గాయాల పాలయ్యారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. లక్కిరెడ్డిపల్లెకు చెందిన సికారు సుబ్బరాయుడు(47), గురుకుమార్‌తో కలిసి బైక్‌పై కలకడ మండల గుడిబండకు బయలుదేరారు. మార్గంమధ్యలోని నారాయణరెడ్డిపల్లె పంచాయతీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్దకు రాగానే రాయచోటి వైపు నుంచి వస్తున్న బొలేరో పికప్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడ్డ సుబ్బరాయుడు, గురుకుమార్‌ను రాయచోటి ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడ్డ సుబ్బరాయుడును తిరుపతి రూయా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

పూరి గుడిసెలు దగ్ధం


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్ఐ రాజశేఖర్

రైల్వేకోడూరు : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు పూరిగుడిసెలు దగ్ధమైన సంఘటన బుధవారం మండల పరిధిలోని వైఎస్సార్ కాలనీలో చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు.. మండలంలోని ఉర్లగట్టుపోడు పంచాయతీలోని వైఎస్సార్ ఎస్టీ కాలనీలో పక్కపక్కనే ఉన్నటువంటి మాణిక్యం పద్మావతి, మాణిక్యం గణేష్ కుటుంబాల వారు ఉదయం తోటల్లో పనికి వెళ్లారు. ఈ సమయంలో ఇరువురి పూరి గుడిసెల్లో షార్ట్ సర్క్యూట్ సంభవించి గుడిసెలు, లోపల సామగ్రి దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోపు పూర్తిగా కాలిపోయినట్లు బాధితులు తెలియజేశారు. సుమారు లక్ష రుపాయల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్టు వారు వాపోయారు. సంఘటనా స్థలాన్ని ఆర్ఐ రాజశేఖర్ పరిశీలించారు. నష్టంపై నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపనున్నట్టు ఆయన తెలిపారు.

కారు ఢీకొని మహిళ మృతి

దువ్వూరు : మండల పరిధిలోని కానగూడూరు గ్రామం వద్ద బుధవారం రాత్రి కారు ఢీకొనడంతో చాగలమర్రి మండలం ముత్యాలపాడు గ్రామానికి చెందిన బీబీ (50) దుర్మరణం చెందింది. అదే గ్రామానికి చెందిన గౌస్ బాషా తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ముత్యాలపాడుకు చెందిన గౌస్ బాషా, బీబీ రాజుపాళెం మండలం వెలవలి గ్రామానికి ఫంక్షన్‌కు వెళ్లి తిరిగి తమ గ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా.. కానగూడూరు సమీపాన కడప నుంచి నంద్యాల వైపు వెళుతున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో బీబీ అక్కడికక్కడే చనిపోగా, గౌస్ బాషా తీవ్రంగా గాయపడ్డా డు. మృతురాలికి భర్త, కుమారుడు, కూతురు ఉన్నారు. తీవ్రంగా గాయపడిన గౌస్ బాషాను 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వా స్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం



సుదర్శన్ (ఫైల్) ఓబులేసు (ఫైల్)


సంఘటనా స్థలంలోనే మృతి చెందిన ఓబులేసు, సుదర్శన్

రాజుపాళెం : మండలంలోని పగిడాల బైపాస్ రహదారిలో బుధవారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వెల్లాల గ్రామానికి చెందిన ఇండ్ల ఓబులేసు (35), దండు సుదర్శన్ (45) వెంగలాయపల్లె వైపు నుంచి స్వగ్రామమైన వెల్లాల గ్రామానికి బైక్‌పై బయదేరారు. పగిడాల గ్రామానికి చెందిన ట్రాక్టరు బైపాస్ రహదారి వద్ద మలుపు తిరుగుతోంది. ఈ క్రమంలో ట్రాక్టర్, బైక్ ఢీకొనడంతో ఓబులేసు, సుదర్శన్ అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ రాజగోపాల్, ఏఎస్‌ఐ సుబ్బారెడ్డి పరిశీలించారు. సమాచారం అందుకున్న మృతుల భార్య, పిల్లలు, బంధువులు చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ ప్రమాదం ఆ రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. పెద్ద పుల్లన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు.

కట్టుదిట్టంగా ఏపీఎండీసీలో పనులు


మాట్లాడుతున్న సీపీఓ సుదర్శన్‌రెడ్డి

ఓబులవారిపల్లె : ఏపీఎండీసీలోకి ఇతరులు లోనికి ప్రవేశించేందుకు అవకాశం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం జరిగిందని సీపీఓ సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఏపీఎండీసీ మంగంపేట కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవ జరిగిన అవినీతిపై ఎండీ వీజీ వెంకట్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రత్యేక కమిటీ విచారణ చేపట్టడం జరిగిందని తెలిపారు. అందులో దోషులుగా తేలిన ఆరుగురి ఉద్యోగులను విధుల నుంచి తొలగించి పోలీసులకు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. ముగ్గురు ఉద్యోగులను అరెస్టు చేసి విచారణ చేస్తున్నారని అన్నారు. మంగంపేట బెరైటీస్ గనులు ప్రపంచ ప్రఖ్యాతి గాంచినందున, కొందరు పని గట్టుకొని ప్రతి రోజు విషం చిమ్ముతున్నారని ఆరోపించారు. ఆధారాలు ఉంటే తమ దృష్టికి తీసుకుని రావాలని, చర్యలు తీసుకొంటామని పేర్కొన్నారు. ఇష్టానుసారంగా ప్రవర్తించి తమ సంస్థ ప్రతిష్టకు భంగం కలిగిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొంటామని వివరించారు.

దివ్యాంగ విద్యార్థుల అభ్యున్నతికి ప్రాధాన్యం


దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలు అందిస్తున్న సమగ్రశిక్ష, వికలాంగుల సంక్షేమ అధికారులు

కడప ఎడ్యుకేషన్ : దివ్యాంగ విద్యార్థులు అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి, జిల్లా వికలాంగుల సంక్షేమశాఖ ఏడీ కృష్ణ కిషోర్ పేర్కొన్నారు. బుధవారం కడప నగరంలోని సమగ్రశిక్ష కార్యాలయ ఆవరణలో సమగ్ర శిక్ష, జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో జిల్లాలోని 18 మండలాల పరిధిలోని 243 మంది దివ్యాంగ విద్యార్థులకు దాదాపు రూ.36 లక్షల విలువ చేసే బోధన ఉపకరణాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్రశిక్ష ప్రాజెక్టు దివ్యాంగులకు ఒక వరం లాంటిది అన్నారు. సమగ్రశిక్ష ద్వారా విభిన్న ప్రతిభావంతులకు ట్రైసైకిళ్లు, వీల్‌చైర్లు, రోటేటర్లు, చంకకర్రలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహిత విద్యా సమన్వయకర్త మిట్ట చెన్నకేశవరెడ్డి, సహాయక సమన్వయకర్త ఉమ్మడి రమణమూర్తి, సెక్టోరల్ అధికారులు దశరథరామిరెడ్డి, రజనీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

ప్రొద్దుటూరు క్రైం : నకిలీ విత్తనాలను విక్రయిస్తే డీలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ మాసుంబాషా తెలిపారు. బుధవారం ప్రొద్దుటూరులోని భారత్ సీడ్స్, పెస్టిసైడ్స్‌తోపాటు పలు దుకాణాల్లో విజిలెన్స్, వ్యవసాయాధికారులు తనిఖీలు నిర్వహించారు. గోడౌన్లు, దుకాణాల్లోని విత్తనాలు, ఎరువులను పరిశీలించారు. అలాగే అమ్మకం, కొనుగోలు రికార్డులను తనిఖీ చేశారు. దుకాణాల లైసెన్స్‌లను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ విజిలెన్స్ డీజీ ఆదేశాల మేరకు కడప, అన్నమయ్య జిల్లాల్లోని విత్తన కేంద్రాల్లో వ్యవసాయాధికారులతో కలిసి తనిఖీలు చేపట్టామన్నారు. నకిలీ విత్తనాలు, అధిక ధరలు, బ్రాండెడ్ తేడాలపై దృష్టి సారించామని చెప్పారు. వీటిలో ఏవైనా తేడాలుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో విజిలెన్స్ సీఐ ఇదురుబాషా, ఏఓ బాలగంగాధర్, ఏఈ కిశోర్, హెడ్‌కానిస్టేబుల్ జనార్ధన్‌రావు, ప్రొద్దుటూరు ఏఓ శివంకర్‌రెడ్డి పాల్గొన్నారు.